క్లుప్తంగా

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నందిగామ: మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులకు అర్హత కలిగి, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో మొత్తం 6 ఖాళీలు ఉన్నాయని, దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి, 18 సంవత్సరాలు పైబడి 35 సంవత్సరాల లోపు ఉన్న వారు గ్రామ, వార్డు సచివాలయ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20 వ తేదీ వరకు అవకాశ ముందన్నారు.

తిరుపతమ్మ ఆలయం వద్ద చలువ పందిళ్ల ఏర్పాటు



పెనుగంచిప్రోలు: వేసవి తీవ్రత దృష్ట్యా స్థానిక శ్రీతిరుపతమ్మ వారి ఆలయం వద్ద అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎండకు ఆలయం వద్ద భక్తులు నిలబడలేకపోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని అధికారులు బయట వైపు రాజగోపురం ముందు, ఉత్తర ద్వారం పక్కన తాటాకుతో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఈద్గా మెట్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.50 వేల వితరణ



జగ్గయ్యపేటఅర్బన్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక బలుసుపాడు రోడ్‌లో ఉన్న ఈద్గాకు మెట్ల నిర్మాణానికి, రంగులు వేయడానికి గాను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను రూ.50 వేలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా గురువారం ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఈద్గా చైర్మన్ మొహిద్దీన్‌కు ఈ నగదు మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, ఈద్గా వైస్ చైర్మన్ సయ్యద్ ఆలీ, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు అక్బర్‌ఖాన్, ఎస్ఎస్‌పీ సైదా, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు ముజీబ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనాలు సమర్పించిన డ్వాక్రా మహిళలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ వారికి గురువారం డ్వాక్రా మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నందిగామ: అగ్రవర్ణాల్లోని పేదలకు కూడా సహాయం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని వైఎస్సార్ సీపీ నాయకుడు లగడపాటి వీరయ్య అన్నారు. మండలంలోని రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అగ్రవర్ణాల పేదలకు ఈబీసీ నేస్తం ద్వారా 45 మందికి రూ.6.75 లక్షలు వారి ఖాతాల్లో జమయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి గ్రామంలోని సచివాలయం వద్ద గ్రామస్తులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల ఆర్థిక ఎదుగుదలకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి సేవలను ప్రజలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైస్తవులు ఐక్యంగా మెలగాలి

వీరులపాడు: క్రైస్తవులు ఐక్యంగా మెలగాలని నేషనల్ క్రిస్టియన్ బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు నవీన్ కుమార్ అన్నారు. వీరులపాడులోని బేసిస్ మిరాకిల్ చర్చిలో గురువారం నిర్వహించిన బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ శ్రేయస్సుకు ప్రార్థనలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు చింతయ్య, శేఖర్ బాబు, జయరాజు, సుందర్‌పాల్, డానియేల్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సంక్షేమ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలుద్దాం

ప్రభుత్వ విప్ ఉదయభాను



జగ్గయ్యపేట 20 వ వార్డులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని 10 వ నంబరు సచివాలయం పరిధిలోని 20 వ వార్డు ముక్త్యాల రోడ్డు బ్రాహ్మణ బజారులో జగనన్నే మా భవిష్యత్తు...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ గృహ యజమానుల అనుమతితో ఇంటి గోడలకు, సెల్‌ఫోన్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా అమలు చేస్తున్న జగనన్న పాలన పలు రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, సచివాలయ కన్వీనర్ మంగు సాయిచైతన్య శర్మ, మండల సోషల్ మీడియా కన్వీనర్ టీఎస్ బ్రహ్మం, వేముల నాని, గృహ సారథులు పాల్గొన్నారు.

బలుసుపాడు గ్రామంలో...

మండలంలోని బలుసుపాడు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సర్పంచ్ యడ్లపల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గృహ సారథులతో కలసి ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం ఉద్దేశాన్ని తెలియజేశారు. గత ప్రభుత్వం కన్నా ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలు గురించి వివరించారు. మంచి చేస్తున్న జగనన్నకు మద్దతు కోరారు. కార్యక్రమంలో నాయకులు శీలం ప్రభాకర్, పత్తిపాటి ఆనందరావు, ఉప్పుతోళ్ల భూషయ్య, దూబ బాలసైదులు, కొరివి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కొడవటికల్లు గడపగడపలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలంలో కొడవటికల్లు, పున్నవల్లి గ్రామాల్లో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలన, అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ముఖ్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అవినీతికి తావు లేని పారదర్శక పాలన సాగిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణ మహిళలకు సైతం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సమర్థంగా అమలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు అగ్రవర్ణ పేదలను పూర్తిగా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని కొనియాడారు. అంతే కాకుండా పారిశ్రామికాభివృద్ధికి సైతం అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలు పాల్గొని లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చావల రవిబాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు కందుల బుచ్చిరామయ్య, జంపాని నాగేశ్వరరావు, వేగినీడి సుబ్బారావు, శ్రీనివాసరావు, మద్దినేని ప్రభాకర్, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాంసం విక్రయ వ్యాపారులు జాగ్రత్తలు పాటించాలి

మున్సిపల్ కమిషనర్ జయరాం



మాంసం విక్రయ వ్యాపారులకు సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

నందిగామ: మాంసం విక్రయ దుకాణాల వ్యాపారులు దుకాణ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణ పరిధిలోని నాలుగవ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆ ప్రాంతంలో అధిక శాతం మాంసం విక్రయ దుకాణాలు ఉన్నాయి. ఆ వ్యాపారులకు ప్రజా ఆరోగ్యానికి సంబంధించి, దుకాణాలలో పాటించవలసిన జాగ్రత్తలపై కమిషనర్ పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్యంకు సంబంధించి ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. నిర్దేశించిన ప్రదేశాలలోనే చెత్తను పడవేయాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట కౌన్సిలర్ మారం అమరయ్య, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి ఏర్పాటుకు చర్యలు

రైతుల వినతిపై స్పందించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



కాండ్రపాడులోని డొంక రోడ్డు, కుమ్మరి వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: కుమ్మరి వాగుకు అధికారులతో సర్వే చేయించటంతో పాటు రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలంలోని కాండ్రపాడు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామ రైతులు వాగు సర్వే, డొంక రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం వినతిపత్రం అందజేశారు. దీంతో తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే రైతులతో కలిసి వాగు, డొంక రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాండ్రపాడు రోడ్డు నుంచి నీళ్లతొట్టి డొంక వరకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని తెలిపారు. రోడ్డు పరిధిలో వందల ఎకరాల సాగు భూమి ఉందని, పంట పొలాలకు వెళ్లి వచ్చేందుకు కూడా నానా ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు పక్కనే ఉన్న కుమ్మరి వాగు సైతం ఆక్రమణలకు గురైందని వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో చర్చించి వాగు సర్వే చేయించి ఆక్రమణలు తొలగిస్తామన్నారు. గ్రామ రోడ్డు నుంచి నీళ్లతొట్టె వరకు వెళ్లే డొంక రహదారిని అభివృద్ధి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. సమస్య చెప్పగానే స్పందించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, సర్పంచ్ గుగులోతు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ కమతం వెంకట నర్సిరెడ్డి, కొండా కృష్ణారెడ్డి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్‌తో సందడిగా గ్రామాలు

వీరులపాడు: జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతుండటంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. మండలంలోని అల్లూరు, జమ్మవరం, వెల్లంకి, వి.అన్నవరం, కొణతాలపల్లి, బోడవాడ, జమ్మవరంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు గురువారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడాలను వివరించారు. అనంతరం సంక్షేమ పథకాలను అర్థమయ్యేలా వివరించి గృహ యజమాని అనుమతితో ఇళ్లకు, వారి సెల్‌ఫోన్లకు స్టిక్కర్‌లు అంటించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బందెల రాణి, శీలం సంధ్య, నండ్రు సౌజన్య, ఎంపీటీసీ సభ్యులు వేమిరెడ్డి కోటేశ్వరి, యాదాల సుజాత, ఐలూరు వెంకట్రావమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటేరు సూర్యనారాయణరెడ్డి, వేమిరెడ్డి మోహన్ రెడ్డి, మావూరు రాజగోపాల్‌రెడ్డి, కుంపటి శ్రీను, వలంటీర్‌లు, గృహ సారథులు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: మండల కేంద్రమైన కంచికచర్లతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం గురువారం జరిగింది. స్థానిక వసంతకాలనీ, ఇందిరా కాలనీ, అంబేడ్కర్ నగర్, అరుంధతీనగర్‌లతో పాటు పలు కాలనీలలో సర్పంచి వేల్పుల సునీత, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పెండ్యాలలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, కీసరలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి పేరం నర్సమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటి తలుపులపై యజమానుల అనుమతితో సీఎం జగన్ స్టిక్కర్లను అతికించారు. మండలంలోని పరిటాలలో సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, చింతా రవీంద్రనాథ్, మార్త శ్రీనివాసరావు, మోగులూరులో సొసైటీ అధ్యక్షుడు బండి జానకిరామయ్య, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఎస్.అమరవరంలో సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, సర్పంచి కోదాటి సీతారాం, గండేపల్లిలో సర్పంచి బొక్కా రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు మట్టా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పిల్లి భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమం నిర్వహించారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భూసార పరీక్ష శిక్షణ వారంపై వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలకు గురువారం ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో 10 రోజుల్లో వ్యవసాయ సీజన్ ప్రారంభ నేపథ్యంలో ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకునేలా గ్రామాల్లో ఆర్‌బీకేల ద్వారా అవగాహన కలిగించాలన్నారు. భూసార పరీక్షల శాంపిల్స్ తీసిన తరువాత సార శాతాన్ని వెంటనే తెలపాలన్నారు. ఫలితాల ఆధారంగా ఎటువంటి పంటలు సాగు చేయాలో రైతులకు వివరించాలని చెప్పారు. పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు వాడితే మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ వెంకట సుబ్బయ్య, ఏవో వరలక్ష్మి, శాస్త్రవేత్తలు శివప్రసాద్, రాజశేఖర్, వ్యవసాయాధికారులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లకల్లులో విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

రూ.తొమ్మిది లక్షల జరిమానా

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసినట్లు జగ్గయ్యపేట ఏడీ గోవిందరాజులు గురువారం తెలిపారు. విజయవాడ విజిలెన్స్ ఈఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 43 బృందాలు గ్రామంలో తనిఖీలు చేశాయి. మొత్తం 2798 సర్వీసులను తనిఖీ చేసి 352 సర్వీసులపై కేసులు నమోదు చేశారు. వీటిలో విద్యుత్ చౌర్యం కేసులు రెండు ఉండగా 350 మందిపై అధిక లోడు కేసులు నమోదు చేశామని తెలిపారు. అధిక లోడు వాడుతున్న వారిపై రూ.తొమ్మిది లక్షల జరిమానా విధించినట్టు వివరించారు. దాడుల్లో ఏఈ తారాచంద్, విజిలెన్స్ ఏడీ నవీన్‌కుమార్, జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం నియోజకవర్గాల ఏఈ, ఏడీలు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జయచంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్యపై గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్‌లు, మహిళా పోలీసులు విధి విధానాలను వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీభార్గవి, ఏసీడీపీవో శివనాగమణి, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ సుబ్బారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్‌లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

సైడ్ డ్రైన్ నిర్మాణ పనుల పరిశీలన

నందిగామ: పట్టణంలోని ఏడవ వార్డు పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం పరిశీలించారు. ముఖ్యంగా ఆ ప్రాంతంలో జరుగుతున్న సైడ్ డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట ఏఈ ఫణి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు మున్సిపల్ చైర్మన్ ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ముస్లిం నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలకు గురువారం స్థానిక 11 వ వార్డులో ఉన్న మసీదులో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పఠాన్ అక్బర్‌ఖాన్, కాశి కిషోర్, తన్నీరు నాగేంద్ర, చిరంజీవి, కౌన్సిలర్ వట్టెం మనోహర్, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

వత్సవాయి: రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాదెల రామారావు తెలిపారు. మండలంలో గురువారం భీమవరం, మక్కపేట, వత్సవాయి, కంభంపాడు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వం చేసిన పనులు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరు గురించి వివరించారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సంక్షేమ పథకాలను జమ చేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. మధ్యలో దళారులు లేకుండా సంక్షేమ పథకాల నగదు నేరుగా అందడంతో లబ్ధిదారుల సంతోషం చెప్పలేకుండా ఉందన్నారు. ఇటువంటి పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగిశెట్టి ముత్తయ్య, కాటేపల్లి రవి, కనగాల రమేష్, కొండబోలు బ్రహ్మం, గుండం రంగారెడ్డి, చింతకుంట్ల వెంకటరెడ్డి, సామినేని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు పౌష్టికాహార కేంద్రాలు

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కేంద్రాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పెద్దవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ మెను ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. ముఖ్యంగా అందించే ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయాలని ఆయన సూచించారు. గతంలో ఏ ప్రభుత్వం అందించనంతగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమతుల పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి, నూతన భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. అనంతరం చిన్నారులకు అందించే ప్రాథమిక విద్యాబోధన విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సింగంశెట్టి నాగేశ్వరరావు, ఉలవలపూడి నరేంద్ర, పలువురు నాయకులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి

న్యాయమూర్తి శోభారాణి



చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పాకెట్లు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి శోభారాణి, న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్: ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని, అందుకు దాతలు ముందుకు రావాలని న్యాయమూర్తి ఎం.శోభారాణి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో గురువారం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు యర్రమాజు ధనుంజయుడు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టుకు వచ్చే కక్షిదారుల దాహార్తిని తీర్చేందుకు కోర్టు ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేయడం సంతోషదాయకమని మాజీ బార్ అధ్యక్షుడు ధనుంజయుడును అభినందించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు అన్నెపాగ కాంతారావు, సీనియర్ న్యాయవాదులు సామినేని వెంకటేశ్వరరావు, కె.మార్షల్ స్టాలిన్, జూనెబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ జి.లక్ష్మీనారాయణ, రాయపూడి శ్రీనివాసరావు, పూల నాగరాజు, కె.శ్రీనివాసరావు, ఎం.కృష్ణయ్య, ఎం.కళావతి, గండికోట శ్రావణ్‌కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల మృతి బాధాకరం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: వాగులో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి చెందటం బాధాకరమని శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామానికి చెందిన షేక్ షాహిద్ (16), షేక్ సాహిర్ (16) గనిఆత్కూరు సమీపంలోని వాగులో ఈత కొట్టేందుకు వెళ్లి మృతిచెందిన విద్యార్థుల కుటుంబ సభ్యులను గురువారం రాత్రి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థులు చిన్న వయసులోనే తిరిగి రాని లోకాలకు చేరటం జీర్ణించుకోలేనిదన్నారు. విద్యార్థుల కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని తెలిపారు.

ప్రతి గడపకు జగనన్న సంక్షేమ పథకాలు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): రాష్ట్రంలో ప్రతి గడపకు జగనన్న సంక్షేమ పథకాలు అందాయని మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం జగనన్నే మా భవిష్యత్...మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడాను గమనించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కంచికచర్ల @ 42 డిగ్రీలు

కంచికచర్ల: కంచికచర్ల ప్రాంతంలో గురువారం 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. దీంతో వృద్ధులు, చిన్నారులు భయాందోళనకు గురయ్యారు. ఏప్రిల్ రెండవ వారంలోనే 40 డిగ్రీల పైగా ఉష్ణోగ్రత నమోదయితే రానున్న కాలంలో ఇంకా ఎండలు తీవ్రంగా ఉంటాయని ప్రజలు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఏసీపీ నాగేశ్వరరెడ్డి

నందిగామ: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చెయ్యడం అభినందనీయమని ఏసీపీ నాగేశ్వరరెడ్డి అన్నారు. సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా తాగునీటితో పాటు, నిత్యం మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రోజురోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం మంచిదన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామిరెడ్డి కోటి సూర్యం, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఐనాల తిరుపతిరావు, తండ్రి: జనార్ధనరావు, ఎన్.టి.ఆర్. జిల్లా, వత్సవాయి మండలం మరియు గ్రామమునకు చెందిన వారు వేములనర్వ గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 146/2లో 2.00 ఎకరములకు డాక్యుమెంట్ నెం. 407/2008 ద్వారా అప్పుకోసం వత్సవాయి సహకార సంఘం నందు సంప్రదించారు. కావున ఎవరికైనా ఈ డాక్యుమెంట్‌పైన ఏమైనా అభ్యంతరాలు ఉంటే వారం రోజులలోపు తమ యొక్క అభ్యంతరము నేరుగా కానీ, పోస్టు ద్వారా కానీ తెలియచేయగలరు.

ఇట్లు: ముఖ్య కార్యనిర్వహణాధికారి
వత్సవాయి సహకార సంఘం (PACS)
వత్సవాయి–521402. సెల్: 91001 33363